క్లుప్తంగా

అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కాకినాడ రూరల్: అంధత్వ నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న 'డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు' వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి కోరారు. వాకలపూడి సచివాలయం-2లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వైద్యాధికారి మహేశ్వరరావు తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 386 మందికి వైద్యపరీక్షలు చేయనున్నట్టు వారు డీఎల్‌డీఓకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. ఈ నెల 13న 18 వరకు షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు వైద్య శిబిరాలు జరుగుతున్నాయన్నారు.

అడబాలకు సీనియర్ సిటిజన్ గుర్తింపు



అడబాలకు సీనియర్ సిటిజన్ కార్డును అందిజేస్తున్న హరిబాబు

కాకినాడ రూరల్: సామాజిక సేవలతో పాటు వృద్ధులకు అండగా నిలుస్తున్న వాకర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు, రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్‌కు సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డును జాతీయ వినియోగదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు మంగళవారం అందజేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో గుర్తింపు కార్డును అందించి సత్కరించారు. సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ వృద్ధులకు వేసవిలో చెప్పులు, శీతకాలంలో దుప్పట్లు మూడున్నర దశాబ్దాలుగా పంపిణీ చేస్తున్న ఘనత అడబాలకు దక్కుతుందన్నారు. న్యాయవాది శ్రీనివాస్, రామకృష్ణ, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్ పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి



వలంటీర్‌కు నియామక పత్రాలు అందజేస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో 38 మంది నూతన వలంటీర్లకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. వలంటరీ వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా పనిచేస్తూ అవినీతి, పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిబ్బంది సుబ్రహ్మణ్యం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి



మోదానీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, ఆయనకు అప్పగించిన గంగవరం పోర్టుతో పాటు అదానీకి అప్పగించిన పోర్టులు, భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యభవన్‌లో మోడీ, అదానీ అక్రమాలపై సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన మోదానీ పుస్తకాన్ని సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, కరణం ప్రసాదరావు, కె.వీరబాబు ఆవిష్కరించారు. మోదీ ప్రోద్బలంతోనే దేశ సంపదను అదానీ లూటీ చేసి సంపన్నుడిగా ఎదిగాడని పేర్కొన్నారు.

టీడీపీ ప్రచారం

కరప: మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, బుంగా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్
- మస్తరు కేంద్రాల్లో కార్మికుల హాజరు తనిఖీ
- గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మస్తర్ కేంద్రాన్ని తనిఖీ చేసి పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

కాకినాడ: పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కాకినాడ బాలభవన్ వద్ద ఉన్న మస్తర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్మికుల హాజరును పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరవుతున్నారో లేదో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ కొన్ని సర్కిళ్లలో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులకు గైర్హాజరవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధ్య విభాగంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కొంతమంది బాధ్యతా రాహిత్యంగా ఎటువంటి సమాచారం లేకుండా విధులకు రాకపోవడం, గైర్హాజరు కావడం వంటి ఫిర్యాదులు ఉన్నాయని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే వారిని విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెగ్యులర్ కార్మికులు కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తే వీరిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో బాధ్యతా రాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తడి-పొడి చెత్త సేకరణ, ఇంటింటికీ చెత్త సేకరణను పరిశీలించారు. అక్కడి శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్మికులకు సూచనలు ఇచ్చారు. అనంతరం వెంకట నగర్ ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అలాగే క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి వర్మ, సిబ్బంది ఉన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమ్మె వాయిదా

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవ



క్లాప్ డ్రైవర్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నేత

కాకినాడ సిటీ: కాకినాడ నగరపాలక సంస్థలో పని చేస్తున్న క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవ తీసుకుని వారితో చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి తలపెట్టిన సమ్మె వాయిదా వేస్తున్నట్లు డ్రైవర్స్ ప్రకటించారు. మంగళవారం క్లాప్ డ్రైవర్ల సర్వసభ్య సమావేశంలో డ్రైవర్లు మాట్లాడుతూ వారాంతపు సెలవులు అమలు చేయాలని, బీమా చేయించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటిపై కాంట్రాక్ట్ సంస్థ స్వయంభూ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం వారికి ముందుగా నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఆ యాజమాన్యం స్పందించకపోవడం వల్ల దశలవారీగా ఆందోళన జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవ తీసుకుని అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో చర్చించి త్వరలోనే డ్రైవర్లతో సర్వసభ్య సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు డ్రైవర్లు ప్రకటించారు. సీఐటీయూ అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ నగరంలో రూ.10 వేలతో జీవించడం సాధ్యం కాదని, అందుచేత డ్రైవర్లు ప్రతీరోజూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మరొక ఉపాధి చేసుకుంటున్నారన్నారు. డ్రైవర్ల కుటుంబ పరిస్థితులను గమనించి ప్రజా ప్రతినిధులు, అధికారులు, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎం.శివశంకర్, గంగాధర్, శ్రీనివాస్, సూరిబాబు, నాని, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



కాకినాడలో అంగన్‌వాడీ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ



అరట్లకట్ట ప్రాథమిక పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు



తూరంగి పీహెచ్‌సీ పరిధిలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ ప్రశాంతి

కాకినాడ సిటీ: అధికశాతం అనారోగ్య సమస్యలకు నులిపురుగులు కారణమవుతున్నాయని, ప్రభుత్వం చేపట్టిన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖాధికారి కె.ప్రవీణ అన్నారు. మంగళవారం కాకినాడ పగోడా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జిల్లాలో 63,527 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసినట్లు తెలిపారు.

తూరంగి పీహెచ్‌సీలో..

తూరంగి పరిధిలో వైద్యాధికారి వి.ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం డి వార్మింగ్ డే నిర్వహించారు. తూరంగి ప్రాథమిక పాఠశాల, మహాలక్ష్మినగర్ పాఠశాలలతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని 52 పాఠశాలలు, 54 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న 10,672 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. డాక్టర్ వసుంధరాదేవి, ఎంపీహెచ్ఈవో పీవీ ప్రకాశరావు, పీహెచ్ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్ పి.రాజశేఖర్, సామ్రాజ్యం, ఏఎన్ఎం రాధాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: నులిపురుగుల నివారణపై డాక్టర్ అద్దాల సత్యనారాయణ అవగాహన కల్పించారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు. రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ ఎంతో అవసరం

కరప: ఆరోగ్య పరిరక్షణకు ఏడాది చిన్నారుల నుంచి 19 ఏళ్ల వయసు వారు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ నాయక్ సూచించారు. ఎన్‌డీడీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలసి కరప, అరట్లకట్ట గ్రామాల్లో పర్యటించి మండల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులతో మాత్రలు మింగించారు. కరప పీహెచ్‌సీ పరిధిలో 42 పాఠశాలలు, 46 అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో 7,912 మంది 19 ఏళ్ల లోపు వయసువారు ఉన్నట్టు గుర్తించామని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులతో కల్సి ఆల్బండాజోల్ మాత్రలు మింగించామని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది వై.రత్నకుమారి, టీబీటీ సుందరి, సత్యవతి, గంగాధర్, రాధాకృష్ణ, ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో కూడా వైద్యసిబ్బంది 19 ఏళ్లలోపు వయసున్నవారితో ఆల్బండాజోల్ మాత్రలు మింగించారు.

90.53 శాతం మందికి ఆల్బెండజోల్ పంపిణీ

కాకినాడ క్రైం: జిల్లాలో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. 4,64,777 మంది విద్యార్థులకు 4,18,975 మందికి మాత్రలు వేసినట్లు తెలిపారు. మిగిలిన బాలలకు ఈ నెల 18న మరో మారు నిర్వహించనున్న కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



కొత్తపేటవీధిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కరప: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ట్రైనీ నర్సులతో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్టు మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కొత్త వైరస్ వ్యాప్తిచెందుతోందన్న వదంతులతో ఈ సర్వే నిర్వహిస్తున్నామని, అనంతరం జ్వర బాధితుల వివరాలపై నివేదిక ఇస్తామని తెలిపారు. ఏరోజుకారోజు సర్వే నివేదికను కరప పీహెచ్‌సీలో అందజేస్తామని సర్వే బృందం తెలిపారు.

మహా సంస్థానం హుండీ ఆదాయం రూ.18.06 లక్షలు

పిఠాపురం: పట్టణంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి హుండీల ద్వారా రూ.18,06,729 ఆదాయం సమకూరినట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దన రావు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం హుండీలను తెరచి లెక్కించారు. గతేడాది నవంబర్ 25 నుంచి మంగళవారం వరకూ రూ.18.06 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు చక్కా దత్త చలపతి, గోసి రమణమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- వేళంగి కళాశాలలో సీసీ కెమేరాల ఏర్పాటు
- పటిష్ట బందోబస్తు నడుమ ప్రశ్నపత్రాలు



వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.ధనకృష్ణారావు తెలిపారు. వేళంగిలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 130 మంది, ద్వితీయ సంవత్సరంలో 67 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలకు ఆరు గదులు కేటాయించామని. బుధవారం ప్రథమ, గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షరాసే విద్యార్థులు ఒక గంట ముందుగానే కళాశాలకు చేరుకోవాలన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రిన్సిపాల్ రూమ్, తరగతి గదులు, వరండాలలో, కళాశాల ప్రాంగణమంతా 14 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశామన్నారు. కరప పోలీసుస్టేషన్‌లో పరీక్షాపేపర్లు భద్రపరచినట్టు తెలిపారు. ప్రతిరోజు పరీక్ష జరిగే సమయానికి అర గంట ముందు అనగా ఉదయం 8.30 గంటలకు పోలీసుస్టేషన్ నుంచి పరీక్షా పేపర్లను పోలీసు బందోబస్తుతో కళాశాలకు తీసుకురానున్నామని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ధనకృష్ణారావు వివరించారు. డీఓగా జెస్సీ డేనియల్‌ను నియమించినట్టు ఆయన చెప్పారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 57 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల మధ్య జరుగుతాయని ఎస్పీ అన్నారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు పరిశీలించి సమాధాన పత్రాల తరలింపు, భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఉండే జెరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని అన్నారు.

నన్నయ అధ్యాపకుడు డాక్టర్ మద్దా మృతి



మద్దా సత్యనారాయణ (ఫైల్)



నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లోని సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ మద్దా సత్యనారాయణ (58) సోమవారం రాత్రి హఠాన్మరణం చెందడంతో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో పొలికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందినట్టు తెలుసుకున్న సిబ్బంది మంగళవారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కమల కుమారి సంతాపం ప్రకటించారు. విదార్థులు ఆయన ఆత్మ శాంతికి మౌనం పాటించారు. సత్యనారాయణ అంత్యక్రియలు స్వగ్రామం ఆకివీడు సమీపంలోని సిద్ధవరంలో జరుగుతుతాయని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

సంపద మెరుగుపడేలా చూడండి



చేబ్రోలులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

పిఠాపురం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మరింత పెరగాలని, తద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. చేబ్రోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పని తీరును పర్యవేక్షించారు. సంపద తయారీ కేంద్రాల్లో చెత్తను వేరు చేసి తయారు చేస్తున్న కంపోస్టు ఎరువును పంచాయతీ పరిధిలో పెంచుతున్న మొక్కలకు వినియోగించడంతో పాటు రైతులకు సరఫరా చేయాలని సూచించారు. సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏపీ మల్లవరంలో పర్యటించిన ఆయన ఇంటి పన్నుల వసూళ్లపై సిబ్బందిని ఆరా తీశారు. ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని, అన్ని గ్రామాల్లోనూ నూరు శాతం పన్నులు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, ఈఓపీఆర్డీ కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్నారి గుండెకు సంఘ మిత్ర అభయం



ప్రవల్లిక తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేసిన సంఘ మిత్ర, వైఎస్సార్ సీపీ నాయకులు

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం శివారులోని జమునానగర్‌లో చిన్నారి ప్రవల్లిక (9)కు గుండె శస్త్ర చికిత్సకు స్థానిక సంఘ మిత్ర సేవా సంఘం రూ.1,40,500 అందజేసి ఔదార్యం చాటుకుంది. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ (బుజ్జి) సంఘ మిత్ర అధ్యక్షుడు ఎండీ ఖాజా, గ్రామ వార్డు సభ్యుడు తోలెం లోవరాజు మంగళవారం ఈ మొత్తాన్ని చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. చిన్నారి చికిత్సకు ఆర్థిక స్థోమత లేని జి.చెల్లారావు కుటుంబానికి శస్త్ర చికిత్సకు ఈ సాయంతో పాటు, రూ.లక్ష బాలిక పోషణార్థం ఎల్ఐసీ బాండ్‌గా గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. సంఘ సభ్యులు చోటుబాబు, హిమంత్ తదితరులు పాల్గొన్నారు. మాధవపట్నం వలంటీర్లు తమకు సహకరించారని సంఘ మిత్ర సభ్యులు వారిని అభినందించారు.

చురుగ్గా జగనన్న ఇళ్లు

- సొంతింటి కల సాకారం
- ఆరు లే అవుట్లలో మొదటి విడతగా 475 మందికి హౌసింగ్ రుణాలు
- ఎమ్మెల్యే ఆదేశాలతో శరవేగంగా పనులు



అరట్లకట్టలోని ఒక లేఅవుట్‌లో చురుగ్గా సాగుతున్న గృహనిర్మాణాలు

కరప: పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, సొంతింటి కల సాకారం చేయాలన్న సీఎం జగన్ ఆశయం నెరవేరుతోంది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో మండల పరిధిలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసి ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేసేందుకు అధికారులు లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నారు. అరట్లకట్ట, జెడ్.భావారం గ్రామాల్లో ఆరు లే అవుట్లలో 582 మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. అరట్లకట్టలో మూడు లే అవుట్లు వేయగా 401 మందికి, జెడ్.భావారంలో మూడు లే అవుట్లలో 181 మందికి పట్టాలిచ్చారు. ఈ గ్రామాల్లో మొదటి విడతగా 393 మందికి గృహ రుణాలు మంజూరు చేశారు. కొంతకాలం పనులు మందకొడిగా సాగాయి. ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పనులు ఊపందుకున్నాయి. హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో గృహనిర్మాణాలకు కావల్సిన వసతులు సమకూర్చడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగో వంతు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోగా మిగిలినవి శ్లాబ్, రూఫ్, పునాదుల దశల్లో ఉన్నాయి.

లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు సమకూర్చుకోవాలన్నది జీవితాశయంగా ఉంటుంది. ప్రస్తుత కాలంలో పెరిగిన ధరలతో సొంతిల్లు మాట దేవుడెరుగు గజం భూమి కూడా కొనుక్కునే పరిస్థితి లేక అద్దె ఇంట్లోనే తలదాచుకుంటూ చాలీచాలని ఆదాయాలతో కుటుంబాలను పోషించుకుంటున్న మధ్యతరగతి ప్రజలకు నేనున్నానంటూ సీఎం జగన్ భరోసా ఇవ్వడంతో ఒక్కొక్కరికి రెండుసెంట్లు భూమి ఆయా గ్రామాల్లో రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు విలువచేసే ఇంటిస్థలం ఇచ్చారు. గృహ రుణాలు రూ 1.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందోత్సవాలు వెల్లువిరిసి, గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇవి కాకుండా డ్వాక్రా గ్రూపు మహిళలకు అదనంగా మరో రూ.50 వేలు బ్యాంక్ రుణంగా మంజూరు చేస్తున్నారు. వీటికి దాచుకున్న కష్టార్జితంతో గృహ నిర్మాణాలు చేపట్టారు. ఇంటిస్థలం, గృహ రుణం మంజూరుకావడంతో సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారు.

లక్ష్యాలు పూర్తి చేసేందుకు చర్యలు



మండల పరిధిలో లబ్దిదారులను చైతన్యపరచి గృహనిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. అరట్లకట్ట, జెడ్.భావారం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. మొదటి విడత లక్ష్యాలు ఉగాది నాటికి పూర్తి చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

– పెంటపాటి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ, కరప మండలం

కన్నబాబు దయతో సొంతిల్లు



భర్త చనిపోవడంతో కుమారుడితో పనులు చేసుకుంటూ అద్దె ఇంటిలో ఉంటున్నాం. సొంతిల్లు కట్టుకోలేననుకున్నాను. ఎమ్మెల్యే కురసాల దయవల్ల పింఛన్ రావడమే కాకుండా, ఇంటి స్థలం ఇచ్చి, రుణం మంజూరు చేయించారు. ఇల్లు కట్టుకుంటున్నాను.

– లంకా పాపలక్ష్మి, అరట్లకట్ట